సాక్షి అనకాపల్లి

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



కాలువంత నిర్లక్ష్యం.! 10లో

ఏలేశ్వరం రిజర్వాయరు ప్రధాన గేట్లు పాడవడంతో నీటి నిలిపివేత, పూడిక తీత సాధ్యం కావడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోంది.



సిరుల తల్లికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్(విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం	కనిష్ఠం
అనకాపల్లి	36.6	26.3

అనకాపల్లి: రాగల ఐదు రోజులు వాతావరణం మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా అనురాధ



సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఈర్లె అనురాధను నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్తగా, అనకాపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేశారు.

283 మంది పోలీస్ సిబ్బందికి ఆన్‌లైన్ బదిలీలు



ఆన్‌లైన్లో పోలీస్ సిబ్బంది బదిలీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి: వివిధ పోలీస్ స్టేషన్లలో ఐదు సంవత్సరాలు పైబడి విధులు నిర్వహిస్తున్న పోలీసులను ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీ చేయనున్నట్టు జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ చెప్పారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందికి ఈ విషయం వివరించారు. సీనియార్టీ ప్రకారం సిబ్బందిని బదిలీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 283 మందికి బదిలీలు జరుగుతున్నాయని, వారిలో 161 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 95 మంది హెడ్ కానిస్టేబుల్స్, 27 మంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారని చెప్పారు. శుక్రవారం బదిలీల ప్రక్రియ ప్రారంభించామన్నారు. క్రైం అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, పరిపాలన అధికారి ఎ.రామ్ కుమార్, ఎస్‌ఐ సురేష్, సూపరింటెండెంట్ గిరి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావు పేట మండలం రాజవరం పంచాయతీ గజపతినగరం గ్రామంలో ఒకేసారి 15 ఎస్సీ కుటుంబాల ఇళ్లకు కరెంట్ కట్ చేశారు. వారికి ఏ నెలలో కూడా 200 యూనిట్లు దాటి కరెంట్ బిల్లు రాలేదు. అయినా రూ.10 వేలు, రూ.11 వేలు, రూ.17 వేలు పాత బకాయిలుగా చూపిస్తూ వారం రోజుల క్రితమే విద్యుత్ శాఖ అధికారులు వారి కరెంట్ కనెక్షన్ తొలగించారు. వేసవి కాలంలో కరెంట్ లేకుండా ఎలా ఉండేదని మొరపెట్టుకున్నా కనికరించలేదు. మరీ ప్రాధేయపడితే బకాయిల్లో సగమైనా కట్టమన్నారు. మిగిలినది ఈ నెలాఖరుకు చెల్లించాలని స్పష్టం చేశారు. దాంతో వారు అప్పు చేసి మరీ బిల్లులు చెల్లించారు.

ఈ ఒక్క గ్రామమే కాదు.. జిల్లాలో ఉన్న 24 మండలాల్లోని ఎస్సీ, ఎస్టీలందరి పరిస్థితి ఇలాగే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో వారికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇచ్చారు. ఇప్పుడు దానిని నిలిపివేయడమే కాకుండా పాత బకాయిలంటూ వేలాది రూపాయల భారం మోపుతున్నారు. బలవంతపు వసూళ్లకు దిగుతున్నారు. ఇలా జిల్లాలో మొత్తం కోటి రూపాయలకు పైగా బకాయిలను చూపిస్తూ ఎస్సీ, ఎస్టీల విద్యుత్ కనెక్షన్లు కట్ చేస్తున్నారు. సగం చెల్లించిన వారికి పునరుద్ధరిస్తూ.. చెల్లించలేని వారి మీటర్లను తొలగిస్తున్నారు.

అంధకారంలో అభాగ్యులు

- ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ నిలిపివేత!
- బిల్లులు చెల్లించని దళితుల ఇళ్లకు కరెంట్ కట్
- నెలకు 200 యూనిట్లలోపు వాడినా బిల్లు కట్టాల్సిందే
- లేదంటే ఇంటి కనెక్షన్లు తొలగిస్తున్న విద్యుత్ అధికారులు
- బిల్లులో సగమైనా చెల్లిస్తేనే పునరుద్ధరణ
- జిల్లాలో రూ.కోటి వరకు బకాయిలు ఉన్నాయని చెబుతున్న అధికారులు
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో దళితులు, గిరిజనులకు ఉచిత విద్యుత్

గణనీయంగా తగ్గిన సబ్సిడీ

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	సబ్సిడీ రూ. కోట్లలో
ఎస్సీలకు..		
2023-24	20,295	8.09
2024-25	21,688	1.33
ఎస్టీలకు..		
2023-24	13,000	4.32
2024-25	14,000	2.92



150 యూనిట్లు మించి వాడలేదు..



మా ఊళ్లో అందరం ఎస్సీ కులానికి చెందినవారమే ఉంటాం. మేమెప్పుడూ 150 యూనిట్లు మించి కరెంట్ వాడలేదు. వారం రోజుల క్రితం రూ.7,874 బిల్లు వచ్చిందని మా ఇంటికి కరెంట్ కట్ చేశారు. వేసవి కాలమని ప్రాధేయపడినా కనికరించలేదు. సగం కడితే కనెక్షన్ ఇస్తామన్నారు. వెంటనే అప్పు చేసి రూ.4000 కట్టాను. ఈనెలాఖరుకు మిగిలిన బిల్లు కూడా కట్టకపోతే మీటర్ తీసుకెళ్లిపోతామని చెప్పారు. గత ప్రభుత్వంలో 200 యూనిట్ల కంటే తక్కువ వినియోగించిన వారందరికీ ఉచిత కరెంట్ ఇచ్చారు. ఇప్పుడు బకాయిలు చెల్లించాలని బెదిరిస్తున్నారు.

–ఏడిద లక్ష్మి, గజపతినగరం, రాజుపేట పంచాయతీ, పాయకరావుపేట మండలం

17 వేలు బిల్లు వచ్చిందని కరెంట్ కట్ చేశారు..





నేను 2024–25లో ఏ నెలలో కూడా 200 యూనిట్లకు మించి కరెంట్ వాడలేదు. ఈ ఏడాది మార్చి–ఏప్రిల్ నెలలో మాత్రమే 217 యూనిట్లు బిల్లు వచ్చింది. రూ.17,259 కట్టమని ఉంది. బిల్లు చెల్లించలేకపోవడంతో లైన్‌మన్ రెండు రోజులు కరెంటు కట్ చేశారు. తక్షణమే రూ.6 వేలు అప్పు చేసి బిల్లు కట్టాను. మిగతా బకాయి ఈ నెలాఖరు నాటికి కట్టకపోతే మీటర్ తీసుకెళ్లిపోతామని చెప్పారు. కలెక్టర్ మేడమ్ గారు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

–అప్పలరాజు, గజపతినగరం, రాజుపేట పంచాయతీ, పాయకరావుపేట మండలం

10 యూనిట్లు కాలిస్తే రూ.3056 బిల్లు వచ్చింది..





నేను ఈ ఏడాది జనవరి–ఫిబ్రవరి నెలలో 10 యూనిట్లు, ఫిబ్రవరి–మార్చి నెలలో 17 యూనిట్లు, మార్చి–ఏప్రిల్ నెలలో 20 యూనిట్లు కరెంట్ వినియోగించాను. కానీ నాకు రూ.3056 కరెంట్ బిల్లు వచ్చింది. కట్టకపోతే కరెంట్ కనెక్షన్ కట్ చేస్తామంటూ లైన్‌మన్ బెదిరించారు. దీంతో వేసవిలో కరెంట్ లేకపోతే కష్టమని.. ముందు రూ.1500 చెల్లించాను. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడితే గతంలోలాగ సబ్సిడీ ఉందా.. లేదా.. అనేది స్పష్టం చేయమని కలెక్టర్ గారిని అడుగుతున్నాం.

– వై.ఏసు, గజపతినగరం, రాజుపేట పంచాయతీ, పాయకరావుపేట మండలం

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వం కావలసిన వారికి కంచాల్లో వడ్డిస్తూ.. సామాన్యులను సమస్యల్లోకి నెడుతోంది. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కుటుంబాల దయనీయ పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇచ్చింది. దాదాపుగా వారు అంతకంటే విద్యుత్ వాడేది లేదు. కానీ నేడు పాత బకాయిలంటూ ఒక్కసారిగా భారం మోపడంతో వారు తల్లడిల్లుతున్నారు. కనెక్షన్లు తొలగించడంతో వారి బతుకుల్లో అంధకారం నెలకొంది. సగమైనా కట్టమని ఒత్తిడి చేయడంతో అప్పుల పాలు కావాల్సి వస్తోంది. దళిత ప్రజా ప్రతినిధి అయిన హోం మంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గంలోనే దళిత కాలనీలు అంధకారంలో మగ్గిపోతుంటే.. రాష్ట్రంలో ఉన్న మిగిలిన ప్రాంతాల పరిస్థితేమిటంటూ దళిత సంఘాల నాయకులు సైతం విచారం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వారం రోజుల క్రితం ఒక దళితవాడలో ఉన్న ఎస్సీ కుటుంబాల వారు నిరసనకు దిగారు. ప్రెస్‌మీట్ పెట్టి మరీ వారికి జరిగిన అన్యాయం గురించి వెల్లడించారు. పలువురికి రూ.4,000 నుంచి రూ.17,000 వరకు బిల్లులు జారీ అయ్యాయి. ఇంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలంటూ పేదలు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా ఉన్న నాతవరం, గొలుగొండ, మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ, కోటవురట్ల, రోలుగుంట, రావికమతం మండలాల్లోని పలు గ్రామాల్లో గిరిజనులు, దళితులకు చెందిన విద్యుత్ కనెక్షన్లను కట్ చేస్తామని విద్యుత్ అధికారులు భయపెడుతున్నట్లు సమాచారం.

రేపు నూకాంబిక అమ్మవారి జాతర ముగింపు



నేడు 3 వేల ఘటాలతో ఊరేగింపు

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి నెల పండగ ముగింపు ఈనెల 27న అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 4.30 గంటల నుంచి అమ్మవారి దర్శనాలను నిలిపివేస్తామని, 28వ తేదీ ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి దర్శనం భక్తులకు కల్పిస్తామని చెప్పారు. శనివారం సాయంత్రం పట్టణంలో 3 వేల ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఉగ్రవాదుల కుట్ర




పట్టణంలో పెరుగు బజార్ జంక్షన్ వద్ద జామా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలి
- అనకాపల్లిలో ముస్లింల ప్రార్థనలు

అనకాపల్లి: కశ్మీర్ ప్రాంతం పహల్గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధంలో ప్రాణాలు కోల్పోయిన 26మంది పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని జామా మసీదు అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ అన్నారు. స్థానిక పెరుగుబజార్ జంక్షన్ మసీదు వీధిలోని జామా మసీదులో శుక్రవారం ఇందుకోసం ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా దేశంలోని ముస్లింలందరూ నల్ల రిబ్బన్లు ధరించి ప్రార్థనలు చేయాలని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఉగ్రవాద చర్యలను దేశ ముస్లింలమంతా తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో హిందూ ముస్లింలు సోదర భావంతో కలిసి జీవిస్తున్నారని, అటువంటి మన దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఉగ్రవాదులు యత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌కు భారత ప్రభుత్వం తగిన బుద్ధి చెప్పబోతోందని, అవసరమైతే పాకిస్తాన్‌పై యుద్ధానికి దేశంలోని ముస్లింలు అందరం సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

తీరంలో అలర్ట్

భద్రత కట్టుదిట్టం



- పాక్ కవ్వింపు చర్యల నేపథ్యంలో తూర్పు నౌకాదళం అప్రమత్తం
- సాగరజలాల్లో దూకుడుగా సన్‌రైజ్ ఫ్లీట్
- సమర సన్నద్ధతపై సమీక్షించిన ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ పెందార్కర్
- ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలన్న తూర్పు నౌకాదళం
- వార్‌షిప్స్, సబ్‌మెరైన్లలో పనిచేసే సిబ్బందికి సెలవులు రద్దు
- సముద్ర జలాల్లో పహారా కాస్తున్న యుద్ధ నౌకలు
- సాగరగర్భంలో మాటువేసిన జలాంతర్గాములు



ఐఎన్ఎస్ డేగాలో నేవల్ ఎయిర్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టమ్

సాక్షి, విశాఖపట్నం :

ముష్కరుల దమనకాండతో భారత్ రగిలిపోతోంది. దౌత్య పరమైన చర్యలు ఇప్పటికే తీసుకొని పాక్ మూలాలపై దెబ్బకొట్టిన భారత్.. మరో అడుగు ముందుకేసి.. సమరానికైనా సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేస్తోంది. దేశ సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్తతలతో ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు విశాఖ కేంద్రంగా తూర్పు నౌకాదళం సిద్ధమవుతోంది. సాగర జలాల్లో యుద్ధ సన్నద్ధతను చాటుకునే ప్రయత్నాలను ప్రారంభించింది. పాక్ నుంచి ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తీరంలో గస్తీని పెంచింది. సన్‌రైజ్ ఫ్లీట్‌ను అప్రమత్తం చేస్తూ ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ అత్యవసర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏ సమయంలోనైనా ఎక్కడ నుంచైనా పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మరోవైపు సముద్ర జలాల్లో యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు పహారా కాస్తున్నాయి. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేంతవరకూ వార్‌షిప్స్, సబ్‌మెరైన్లలో విధులు నిర్వర్తించే సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్లు నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి.

ఉగ్రమూకల దాడుల నేపథ్యంలో సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలు సిద్ధమవుతున్నాయి. ఇదే క్రమంలో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న తూర్పు నౌకాదళం కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు అందాయి. దీంతో ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో అలర్ట్ ప్రకటించారు. బంగాళాఖాతంలో గస్తీని పెంచడంతో పాటు యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సెలవులను కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. తూర్పు నౌకాదళ పరిధిలోకి ఇతరుల ప్రవేశాన్ని కూడా నిషేధించారు. తూర్పు నౌకాదళాధిపతి రాజేష్ పెందార్కర్ తూర్పు స్వార్డ్ సన్‌రైజ్ ఫ్లీట్ సిబ్బందితో గురువారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. నేవల్ బేస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఇటీవల చురుగ్గా కార్యకలాపాలు నిర్వహించిన సన్‌రైజ్ ఫ్లీట్ సిబ్బందిని ప్రశంసించారు. దేశ కార్యాచరణ అవసరాలు తీర్చేందుకు ప్రతి ఒక్క సెయిలర్, అధికారి సిద్ధంగా ఉండాలని ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో భద్రతా పరిస్థితిపై మరింత దృష్టి సారించాలంటూ దిశానిర్దేశం చేశారు. అత్యవసర కార్యకలాపాలకు సంయమనంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. మారిటైమ్ భద్రత, కార్యాచరణ సవాళ్లతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపైనా దృష్టి సారించాలన్నారు. వ్యక్తిగత భద్రత, సైబర్, సమాచార భద్రత విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దేశ ప్రయోజనాల కోసం.. భారతీయుల భద్రత కోసం ఎక్కడ నుంచైనా.. ఏ సమయంలోనైనా పోరాటం సాగించేందుకు సన్‌రైజ్ ఫ్లీట్ సిద్ధంగా ఉందన్న నమ్మకాన్ని దేశానికి కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పిలుపునిచ్చారు.

ఎలాంటి కవ్వింపు చర్యలనైనా ఎదుర్కొనేలా..

గతంలోనూ చైనా, పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడినప్పుడు తూర్పు నౌకాదళం వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టింది. 1971లో పాక్‌పై విజయం సాధించడంలో ఈస్టర్న్ నేవల్‌కమాండ్ కీలక పాత్ర పోషించింది. మన యుద్ధ సన్నద్ధతను తెలుసుకునేందుకు పాక్ మరోసారి ఏమైనా చర్యలకు పాల్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో బంగాళాఖాతంలో ఈఎన్‌సీ గస్తీ పెంచింది. తూర్పు నౌకాదళ పరిధిలో ఉన్న సుమారు 60 యుద్ధ నౌకలతో పాటు 6కిపైగా సబ్‌మెరైన్లు రంగంలోకి దిగాయి. సముద్ర జలాల్లో వార్‌షిప్స్ పహారా కాస్తుండగా.. సాగర గర్భంలో సబ్‌మెరైన్లు ఎలాంటి విపత్తునైనా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేశాయి. మరోవైపు.. కోస్ట్ గార్డ్ నౌకలతో నిరంతరం సముద్రంలో పహారా కాస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ ప్రత్యర్థి వ్యూహాలను అంచనా వేస్తున్నారు.

యుద్ధ విమానాల పైలట్లకు శిక్షణ తీవ్రతరం

సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న క్రమంలో ఈఎన్‌సీ ఎయిర్ బేస్ ఐఎన్ఎస్ డేగాలో యుద్ధ విమానాల పైలట్లకు శిక్షణ తీవ్రతరం చేశారు. వాస్తవంగా ఏడాది పొడవునా ఇక్కడ పైలట్ల శిక్షణ కొనసాగుతుంటుంది. కానీ ప్రస్తుతం యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న తరుణంలో దీన్ని మరింత చురుగ్గా కొనసాగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని దాడులకు తెగబడుతున్న శత్రుదేశాల కుయుక్తుల్ని తిప్పికొట్టేందుకు భారత నౌకాదళం స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన నేవల్ ఎయిర్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టమ్ (ఎన్ఏఐఎస్ఎస్)ను సిద్ధం చేశారు. ఎయిర్ స్టేషన్‌లో స్మార్ట్ ఫెన్స్‌ను అమర్చి.. సీసీకెమెరాల సాయంతో పహారా కాస్తున్నారు. స్మార్ట్ ఫెన్స్‌లోపలికి ఏ ఎయిర్‌క్రాఫ్ట్, హెలికాప్టర్, మనిషి వచ్చినా.. వెంటనే కంట్రోల్ రూమ్‌కు అప్రమత్తం చేయడంతో పాటు సెకెన్ల వ్యవధిలో మొత్తం వ్యవస్థకు సమాచారం అందజేస్తుంది.

ఎయిర్‌స్టేషన్ చుట్టూ ఇన్‌ఫ్రారెడ్ డివైజ్‌లు, మోషన్ డిటెక్టర్స్, ఏ చిన్న రంధ్రం చేసి లోపలికి ఎవరు ప్రవేశించాలని భావించినా వారిని మట్టుపెట్టేలా యాంటీ పెనిట్రేషన్, థర్మల్ సెన్సార్లతో పాటు డ్రోన్ల పర్యవేక్షణతో పహారా ముమ్మరం చేసినట్లు సమాచారం.



క్లుప్తంగా

ఏయూకి శతాబ్ది ఉత్సవ శోభ

- నేటి నుంచి శతాబ్ది సంవత్సరం ప్రారంభం
- ఏడాది పొడవునా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక



విద్యుత్ కాంతుల మధ్య ఏయూ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడాదిపాటు జరిగే ఈ వేడుకల ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ కోర్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వాకథాన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం సిరిపురం, స్నాతకోత్సవ మందిరం, పరిపాలన భవనం వద్ద ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక బెలూన్‌ను ఎగురవేస్తారు. మధ్యాహ్నం 3:30 గంటలకు బీచ్ రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాన వేడుకలు జరుగుతాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభమైన తర్వాత ఏయూ విజన్ డాక్యుమెంట్, లోగో ఆవిష్కరణ, ప్రత్యేక నృత్య రూపకం ప్రదర్శిస్తారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్, వీసీ, అతిథుల ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం 6:30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొంటారు. వర్సిటీ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏడాది పొడవునా అకడమిక్, ఔట్రీచ్, మెగా ఈవెంట్లు నిర్వహిస్తామని, 2026 ఏప్రిల్ 26న ముగింపు వేడుకలు ఘనంగా ఉంటాయని తెలిపారు.

కేజీబీవీలో అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన నేడు

నాతవరం: మర్రిపాలెంలో ఉన్న కేజీబీవీలో అదనపు భవన నిర్మాణం కోసం శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ఇందు కోసం రాష్ట్ర అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు రానున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తెలిపారు. అదనపు భవన నిర్మాణానికి రూ.1.68 కోట్లు మంజూరయ్యాయన్నారు.

కాలువంత నిర్లక్ష్యం..!

- పాడైన ఏలేశ్వరం రిజర్వాయరు ప్రధాన గేట్లు
- నీరు నిలిపివేతకు మొరాయిస్తున్న గేట్లు
- ఏలేరు కాలువలో సాధ్యం కాని పూడిక తీత ప్రక్రియ
- నిధులున్నా పనులు చేసేందుకు ఆటంకంగా కాలువలో నీటి ప్రవాహం



అడుగ భాగంలో పూడిక తీయక ఏలేరు కాలువపై పొంగి ప్రవహిస్తున్న నీరు



పని చేయని ఏలేశ్వరం రిజర్వాయరు ప్రధాన గేట్లు

నాతవరం: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం ఏలేశ్వరం రిజర్వాయరుకు శాపంగా మారింది. ఈ రిజర్వాయరు నీటిపై ఆధారపడిన కాకినాడ జిల్లా రైతులు, విశాఖపట్నం ప్రజలు, పరిశ్రమల భవిష్యత్తుపై సర్వత్రా ఆందోళన నెలకొంది. ఏలేశ్వరం రిజర్వాయరు ప్రధాన గేట్ల మరమ్మతుల కారణంగా ఈ ఏడాది ఏలేరు కాలువలో పూడికతీత పనులు సాధ్యపడలేదు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి విశాఖపట్నం వరకు 154 కిలోమీటర్లు పొడవున కాలువ ఉంది. ఈ కాలువ ద్వారా నీటిని తరలించి విశాఖపట్నంలో ప్రజలకు తాగునీరు, పలు పరిశ్రమల వినియోగం కోసం నీరు సరఫరా చేస్తున్నారు. రోజు ఒక్కంటికి అవసరాలను బట్టి 100 నుంచి 110 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీటిని తరలిస్తుంటారు.

ఏటా మార్చిలో మరమ్మతులు

ప్రతి ఏటా వేసవిలో మార్చి నుంచి మే నెలలోపు ఏలేరు కాలువలో పూడిక తీతతో పాటు శిథిలమైన కాలువల మరమ్మతులు చేస్తుంటారు. కాలువలు అభివృద్ధి చేయడం వల్ల వర్షాలు, తుపాన్ల సమయంలో ఏలేరు కాలువ ఎక్కడ దెబ్బతినకుండా నీరు సక్రమంగా ప్రవహిస్తుంది. ప్రధానంగా కాలువలో పూడిక తొలగించడం వల్ల నీరు ఎక్కడా వృథా కాకుండా వేగంగా ప్రవహిస్తుంది. ఏలేరు కాలువ మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి జీవీఎంసీ ద్వారా రూ.8 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో ఆయా పనులు చేసేందుకు టెండర్లు కూడా ఆ శాఖ అధికారులు ఖరారు చేశారు. కాలువలో పూడిక తీత, ఇతర పనులకు సంబంధించి 154 కిలోమీటర్లకు రూ.4.50 కోట్లు, మిగతా రూ.3.50 కోట్లతో స్లూయిజ్‌ల మరమ్మతులు, తుపాన్ల సమయంలో కాలువకు పడిన గండ్లు పూడ్చివేతకు నిర్ణయించారు. మార్చి నెలలో ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి నీటిని నిలుపుదల చేసేందుకు నిర్ణయించారు. అయితే రిజర్వాయరు ప్రధాన గేట్లు పాడైపోయాయి. దీంతో కాలువలో ప్రవహించే నీటిని నిలుపుదల చేసేందుకు గేట్లు కిందకు దిగడం లేదు. ఫలితంగా కాలువలో నీరు ప్రవహించడంతో పూడిక తీత పనులు చేపట్టడానికి కుదరలేదు. రిజర్వాయర్, ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంతో గేట్ల మరమ్మతులు గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గేట్లు శిథిలం కారణంగా ఏలేశ్వరం రిజర్వాయరు నీరు అంచనాకు మించి బయటకు పోవడంతో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయన్న చర్చ సాగుతోంది. ఏటా పనులు చేస్తేనే కాలువతో ఇబ్బందులు తప్పే వీలు. కాలువ పూడిక తీత, మరమ్మతులు చేయకపోవడంతో ఈ ఏడాది తుపాన్లు, వర్షాల సమయంలో ఏలేరు కాలువలో నీటి ప్రవాహం ఏవిధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే.

ఏలేరు కాలువ ద్వారా నీటి సరఫరా ఇలా..

	ఎంజీడీలు
జీవీఎంసీ తాగునీరు	50
విశాఖ స్టీల్ ప్లాంట్	20
గ్రేటర్ పరిధిలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ	09
ఏపీఐఐసీ	07
గంగవరం పోర్టు	02
గాజువాక వాటర్ ప్లాంటేషన్	0.824
గోదావరి రైవాడ వాటర్ ప్లాంటేషన్	0.15
అగనంపూడి వాటర్ ప్లాంటేషన్	0.2

కాలువలో పనులు చేపట్టలేం..

ఏలేరు కాలువలో పూడికతీత, ఇతర మరమ్మతులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఏలేశ్వరం రిజర్వాయరు గేట్ల మరమ్మతుల కారణంగా నీటిని నిలుపుదల చేసేందుకు గేట్లు కిందకు దిగడం లేదు. దాంతో కాలువలో నీరు నిలుపుదల కాక పనులు చేయలేదు. అక్కడ ఇరిగేషన్ శాఖ అధికారులు గేట్లు నిలుపుదల చేయలేకపోయారు. ఏలేరు కాలువ అభివృద్ధికి రూ.8 కోట్లు మంజూరయ్యాయి. కాలువులోపల పనులు కాకుండా బయట పనులు చేపట్టేలా కలెక్టరు దృష్టికి తీసుకెళ్తాం.

– మురళీకృష్ణ, ఈఈ, ఏలేరు కాలువ

డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం!



- అభ్యర్థి తెలియక కూటమి పార్టీలో తికమక
- తమకేనంటూ జనసేన ప్రచారం
- తమకూ కావాల్సిందేనంటున్న టీడీపీలోని మరో వర్గం
- నేడు డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై అవిశ్వాసం విషయంలో కూటమి పార్టీల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డిప్యూటీ మేయర్ సీటు తమదేనని జనసేన నేతలు ప్రచారం చేస్తుండగా, కాదు కాదు మాకేనని టీడీపీ మేయర్ అభ్యర్థి పీలా శ్రీనివాసరావు అనుచరులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో, డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి కట్టబెడతారో తేల్చకుండానే కూటమి అవిశ్వాసానికి సిద్ధమైంది. శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై అవిశ్వాసానికి కూటమి ఏర్పాట్లు చేసింది. డిప్యూటీ మేయర్ ఎవరికి ఇస్తారో తేల్చకుండా అవిశ్వాసానికి కూటమి నేతలు వెళుతుండడంతో కార్పొరేటర్లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తమ వర్గానికి డిప్యూటీ మేయర్ పదవిపై స్పష్టత ఇస్తే తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటామని పదవి ఆశిస్తున్న కార్పొరేటర్లు కూటమి నేతలపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే, ముందుగా డిప్యూటీ మేయర్ అభ్యర్థిని ప్రకటిస్తే, మిగిలిన నేతల నుంచి నిరసన వ్యక్తమయ్యే అవకాశం ఉంది. దీంతో అవిశ్వాసం వీగిపోయే ప్రమాదముందని కూటమి నేతలు భావిస్తున్నారు. మొన్నటి మేయర్ అవిశ్వాసం ఓటింగ్‌లో కూడా చావు తప్పి కన్నులొట్టపోయిన చందంగా పరిస్థితి ఏర్పడింది. డిప్యూటీ మేయర్ విషయంలో మాత్రం అవిశ్వాసం వీగిపోతుందని కూటమి పార్టీల్లోని కార్పొరేటర్లే అంతర్గతంగా చర్చించుకుంటుండడం గమనార్హం.

తమకంటే తమకు కావాలంటూ...!

మేయర్ పదవి ఎవరికి ఇవ్వాలనే విషయంలో బహిరంగంగా అభ్యర్థిని ప్రకటించకపోయినప్పటికీ, అవిశ్వాసం సమయానికి స్పష్టత ఉంది. మేయర్ పోటీలో పీలా శ్రీనివాసరావు బరిలో ఉన్నట్లు కార్పొరేటర్లతో పాటు కూటమి పార్టీల్లోని నేతలకూ సమాచారం ఉంది. అయితే, డిప్యూటీ మేయర్ విషయంలో మాత్రం ఈ స్పష్టత ఎక్కడా లేదు. డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం విషయంలో కూటమి పార్టీలో చీలికలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీకి మేయర్ పదవి ఇచ్చిన నేపథ్యంలో పొత్తు ధర్మంలో భాగంగా డిప్యూటీ మేయర్ తమకు కావాలంటూ జనసేన పార్టీ కోరుకుంటోంది. డిప్యూటీ మేయర్ పదవి తమకే ఇస్తారని ఆ పార్టీ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ కార్పొరేటర్ల సమావేశంలో చెప్పారు. అయితే, అదే సమయంలో ఆ పార్టీ నుంచి ఆరుగురు ఆశావహులున్నారు. జనసేన నుంచి కందుల నాగరాజు, ఉష శ్రీ, హేమలత, భీశెట్టి వసంతలక్ష్మి, వంశీరెడ్డి, సాధిక్‌లు పదవి ఆశిస్తున్నారు. వీరిలో ఎవరికి ఇస్తారనే విషయంలో ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఎవరికివారుగా తమదే సీటు అని ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు టీడీపీలో కూడా డిప్యూటీ మేయర్ పోస్టు కోసం పోటీ ఉంది. పల్లా శ్రీను, గంధం శ్రీనులు ఆశిస్తున్నారు.

జనసేనలో కూడా చీలిక

జనసేన పార్టీలో కూడా డిప్యూటీ మేయర్ పదవి ఆశిస్తున్న వారిలో రెండు వర్గాలుగా విడిపోయినట్టు తెలుస్తోంది. మొదటి నుంచీ పార్టీలో ఉండి..కార్పొరేటర్‌గా పార్టీ గుర్తుపై గెలిచిన వారికే ప్రాధాన్యత ఉండాలనే వాదన ఉంది. ఈ వాదనను జనసేన ఫ్లోర్ లీడర్‌తో పాటు నిత్యం వార్తల్లో ఉండే మరో కార్పొరేటర్ తెరమీదకు తెచ్చినట్టు తెలుస్తోంది. అయితే మొదటి నుంచీ పార్టీలో లేరనే వాదనతో తమను పట్టించుకోకపోవడం సరికాదని ఉష శ్రీ, సాధిక్, కందుల నాగరాజు తదితరులు వాదనకు దిగుతున్నారు. డిప్యూటీ మేయర్‌గా మహిళలకే అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ ఫ్లోర్ లీడర్‌తో పాటు ఉష శ్రీ కూడా మరో వాదన వినిపించడం ప్రారంభించారు. దీంతో అభ్యర్థిత్వం విషయంలో ఆ పార్టీ కూడా తేల్చుకోలేకపోతోంది. ఇక సందులో సడేమియా అన్నట్టుగా స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచిన విల్లూరి భాస్కరరావు కూడా డిప్యూటీ మేయర్ పదవి కోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నేత, ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్ ద్వారా ఆయన పావులు కదుపుతున్నట్టు సమాచారం. మొత్తంగా డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం విషయంలో కూటమి పార్టీలో నెలకొన్న విభేదాలు ఓటింగు విషయంలో స్పష్టంగా బయటపడే అవకాశం ఉందన్న అభిప్రాయం మాత్రం బలంగా వినిపిస్తోంది. తద్వారా వైఎస్సార్ సీపీ ఖాతాలోనే డిప్యూటీ మేయర్ పదవి ఉంటుందని కూడా అంతే బలంగా వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తప్పనిసరి

అనకాపల్లి: దోమకాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) వై.సత్యనారాయణరావు అన్నారు. స్థానిక జోనల్ కార్యాలయం వద్ద జాతీయ మలేరియా దినోత్సవ ర్యాలీని శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దోమల బారినపడకుండా వీలైనంత వరకూ చేతులకు, కాళ్లకు నిండుగా ఉండే వస్త్రాలను వేసుకోవాలన్నారు. కిటికీలు, తలుపులకు దోమలు రాకుండా మెష్‌లు వేసుకోవాలన్నారు. రాత్రి సమయంలో నిద్రించేటప్పుడు దోమ తెరలు తప్పకుండా వాడాలని ఆయన సూచించారు. అంతకు ముందు జోనల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ, జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్స్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు



గంజాయి కేసులో పాత నేరస్తుడు అరెస్ట్



నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న గొలుగొండ ఎస్‌ఐ రామారావు

గొలుగొండ: ఏటిగైరంపేట గ్రామంలో 2021లో గంజాయి తరలిస్తున్న సమయంలో బైక్ వదిలేసి పారిపోయిన నిందితుడిని గొలుగొండ ఎస్‌ఐ రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2021లో ఏటిగైరంపేట గ్రామంలో 36 కేజీల గంజాయి బైక్‌పై తరలిస్తుండగా.. అల్లూరి జిల్లా వాడలపాలెం గ్రామానికి చెందిన వంతల సుందర్రావు అప్పట్లో తప్పించుకుని పారిపోయాడు. వదిలేసిన బైక్ ఆధారంగా ఒడిశా రాష్ట్రం సరిహద్దుల్లో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్‌ఐ, సిబ్బందిని సీఐ రేవతమ్మ, డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

గంజాయి తరలిస్తున్న ఉత్తరప్రదేశ్ వాసి అరెస్ట్



బైక్‌పై బ్యాగ్‌లో గంజాయిని తీసుకువెళ్తున్న యువకుడిని పట్టుకున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

కె.కోటపాడు : వారాడ కూడలి వద్ద బైక్‌పై గంజాయిని తరలిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆర్మాన్‌ను ఎ.కోడూరు ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ శుక్రవారం అరెస్ట్ చేశారు. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో వారాడ నుంచి కె.కోటపాడు వైపు వేగంగా బైక్‌పై వస్తున్న ఆర్మాన్‌ను పోలీసులు ఆపారు. బైక్‌పై ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా.. అందులో కిలో గంజాయిని గుర్తించారు. నిందితుడిని విచారించగా ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు అంగీకరించాడు. ఆర్మాన్‌పై కేసును నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి



మృతి చెందిన ఎర్రయ్యమ్మ

రోలుగుంట: రోలుగుంటకు చెందిన మతిస్థిమితం లేని కామిరెడ్డి ఎర్రయ్యమ్మ(80) బావిలో పడి మృతి చెందిన ఘటన కొవ్వూరు నూకాలతల్లి గుడి సమీపంలో జరిగింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామకృష్ణ శుక్రవారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరుకు చెందిన ఎర్రయ్యమ్మ గత కొంత కాలంగా కుమార్తె ఇంట్లో ఉంటోంది. మతి స్థిమితం లేక ఆమె ఎక్కడెక్కడో తిరిగి కుటుంబీకులు, బంధువుల సాయంతో తిరిగి ఇంటికి చేరుకునేది. ఈ నేపథ్యంలో గురువారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. శుక్రవారం కొవ్వూరు నూకాలతల్లి గుడి సమీపంలోని రోలుగుంటకు చెందిన ములగపాకవారి రోడ్డు పక్కనున్న బావిలో శవమై కనిపించింది. బావిలో కాలు జారిపడి మృతి చెందినట్టు గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైల్వే ట్రాక్ పక్కన మహిళ మృతదేహం



యలమంచిలి రూరల్: యలమంచిలి–నర్సింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆఫ్‌లైన్‌లో రైల్వే ట్రాక్ పక్కన శుక్రవారం గుర్తు తెలియని మహిళ(35) మృతదేహాన్ని గుర్తించినట్టు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. గుర్తు తెలియని రైలు నుంచి ఆమె జారిపడి ఉండొచ్చని భావిస్తున్నట్టు చెప్పారు. ఆకుపచ్చ రంగు చీర, బంగారు రంగు జాకెట్టు ధరించి ఉన్న మృతురాలి ఎత్తు 5 అడుగులు ఉంటుందని, తెలుపు ఛాయ, కోల ముఖం కలిగి ఉందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మహిళ ఆచూకీ కోసం 94906 19020 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

తాళ్లపాలెం పీహెచ్‌సీలో తనిఖీలు



తాళ్లపాలెం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేసి సమీక్షిస్తున్న జిల్లా అదనపు కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి బాలాజీ

కశింకోట: జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసి, శత శాతం లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని జిల్లా అదనపు కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి(డీఎల్ఏటీవో), ప్రొగ్రాం అధికారి డాక్టర్ ఎం.వి.ఎస్.కె. బాలాజీ వైద్యాధికారి, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. రికార్డులు, నివేదికలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.మనీషా, ఆరోగ్య విస్తరణాధికారి వి.ఎ.సుబ్బారావు, హెల్త్ ఎడ్యుకేటర్ కె.ఎస్.ఆర్.కె.జి.నరసింహారావు, ఆరోగ్య పర్యవేక్షకురాలు ఆర్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



వరలక్ష్మి, ఆమె ఇద్దరి పిల్లలు

బుచ్చెయ్యపేట: మండలంలోని అప్పంపాలెం గ్రామానికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరి పిల్లలతో అదృశ్యమయ్యారు. బుచ్చెయ్యపేట ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్.శివరాంపురం శివారు అప్పంపాలెం గ్రామానికి చెందిన చల్లపు వరలక్ష్మి(26) తన కుమార్తెలు టర్నిక శ్రీ(8) కుందన(6)తో కలిసి గురువారం ఉదయం అనకాపల్లి ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త శివ బంధువులు, చుట్టు పక్కల వెతికినా కనిపించలేదు. శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 04211 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధి సామాన్యులకు చేరాలి



సమావేశంలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ రమేష్, మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందేలా చూడవలసిన బాధ్యత జిల్లా అధికార యంత్రాంగంపై ఉందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. సీఎం రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా కలెక్టర్ శాఖల వారీగా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విభాగాలైన రైల్వే, జాతీయ రహదారులు, నాబార్డు, బీఎస్ఎన్ఎల్, ఎన్టీపీసీ, ఏపీఐఐసీ, ఖాదీ, ఈశ్రమ్ పోర్టల్, డ్వామా, డీఆర్‌డీఏ, స్కిల్ డెవలప్‌మెంట్, గృహనిర్మాణ శాఖ, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్ రోడ్లపై సమీక్ష నిర్వహించామన్నారు. జిల్లా అభివృద్ధిపై హోం శాఖ మంత్రి, శాసనసభ స్పీకర్ సూచన మేరకు అనేక ప్రతిపాదనలను సమీక్షించి వాటి అమలుకు కృషి చేస్తామన్నారు. నాబార్డు పథకంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను పూర్తి చేయడానికి రూ.9 కోట్లు అవసరమని చెప్పారు. ఎంపీ నిధుల నుంచి గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందుకు తగిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇరిగేషన్ కాలువలకు లైనింగ్ పనులు, చెరువుల పూడికతీత వంటి పనులను వేసవిలోనే చేపట్టాలని సూచించారని చెప్పారు. ఈ సమావేశంలో పెందుర్తి, యలమంచిలి, వి.మాడుగుల శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఎంపీపీలు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల కోసం కటాఫ్ తేదీని మార్చాలి



పింఛన్ల మంజూరులో నిబంధనలు సడలించాలని ఎండీడీవోకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం

నక్కపల్లి: స్పౌజ్ కోటా కింద మంజూరు చేసే పింఛన్లకు ప్రభుత్వం విధించిన కటాఫ్ తేదీని మార్చాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎంపీడీవో సీతారామరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే అతని భార్య పేరున పింఛన్ మార్చేందుకు ప్రభుత్వం కటాఫ్ తేదీని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. 1.12.2023 నుంచి 31.10.2024 మధ్యలో చనిపోయిన వారి పింఛన్లు మాత్రమే వారి భార్య పేరున మంజూరు చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించడం వల్ల చాలా మంది నష్టపోతారన్నారు. చిన్న వయస్సు భర్త చనిపోయిన పలువురు పింఛన్ కోసం మరో ఏడాది వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఏప్రిల్ 25వ తేదీనే కటాఫ్ తేదీగా నిర్ణయించి అప్పటి వరకు అర్హులైన వారందరికి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అధికారంలోకి వస్తే 50 ఏళ్లు దాటిన బీసీలందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ఇంత వరకు అమలుకు నోచుకోలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా 65 ఏళ్లు దాటిన వృద్ధులందరికీ వలంటీర్ల సాయంతో పింఛన్లు మంజూరు చేశామని గుర్తు చేశారు.

'దాడి చేసిన కిలపర్తిపై కేసు నమోదు చేయాలి'

దేవరాపల్లి: భూ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు వెళ్లిన తమపై దాడి చేసిన మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, తదితరులపై కేసు నమోదు చేయాలని దేవరాపల్లికి చెందిన జాగరపు రాజునాయుడు, సోమిరెడ్డి అప్పలనాయుడు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ దేవరాపల్లి సర్వే నంబర్ 277/12లో సుమారు 5.16 ఎకరాల భూమికి సంబంధించి ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తుందన్నారు.

కోర్టు వివాదం ఉన్నప్పటికి కిలపర్తి భాస్కరరావు తన అనుచరులతో కలిసి గురువారం సదరు భూమిలోకి వెళ్లడంతో తాము ఈ సమస్యపై చర్చించేందుకు వెళ్లామన్నారు. తాము మాట్లాడక ముందే భాస్కరరావు సహా ఐదుగురు వ్యక్తులు తమపై దాడి చేశారని ఆరోపించారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి తప్పా అధికార పార్టీ అండతో ఇలా దాడులకు తెగబడే విష సంస్కృతికి బీజం వేయడం సరికాదని వారు హితవు పలికారు. ఇది ఇలా ఉండగా ఇదే వివాదంలో రాజునాయుడు తదితరులు తమపైనే దాడి చేశారంటూ కిలపర్తి భాస్కరరావు, రాజులమ్మ కూడా వేర్వేరుగా పోలీసులకు పిర్యాదు చేశారు.

దీనిపై స్థానిక ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావును వివరణ కోరగా ఇది భూసంబంధిత వివాదం కావడంతో తహసీల్దార్ కోర్టుకు బదిలీ చేయనున్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE
3 BHK House 302 Sqy. East Facing 2000 Sft., 3 Cr, @ Gajuwaka VUDA Colony, A to Z Real Estate Consultancy. Ph : 95421 56666 [V- 6888]

Services

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

OLD AGE HOME
Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం|| వైద్యసేవలు. హోంకేర్ సర్వీస్ కలదు. ఫోన్: 87904 49799, 90103 92178 [SCA25002714]

Wanted

మీరు వున్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు (పార్ట్ / ఫుల్ టైం). 100% ఎటువంటి ఫీజులు ఉండవు. ఫోన్: 97015 05819 [SCA25002876]

ఉద్యోగ అవకాశాలు : మల్టీ క్రోర్ సంస్థ యొక్క వైజాగ్ బ్రాంచ్‌లో పనిచేయుటకు (1) చీఫ్ మేనేజర్లు -5 (M/F). రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్స్ / VRS / బ్యాంక్ ఉద్యోగులు మార్కెటింగ్ లీడర్స్‌ను రూపొందించడంలో 2 సం|| అనుభవం ఉండాలి. వయస్సు : 40+. (2) మార్కెటింగ్ మేనేజర్స్ - 5 (M/F). టీమ్ క్రియేషన్‌లో 1 సం|| అనుభవం. వయస్సు : 30 +. కేంద్ర / రాష్ట్ర ఉద్యోగులు / టీచర్స్ & రిటైర్డ్ & వర్కింగ్ వారు & గృహిణులు అర్హులు. ఫుల్ / పార్ట్ టైమ్. నోట్ : నేరుగా జరుగు ఇంటర్వ్యూలో MFA + స్పెషల్ ప్యాకేజి నిర్ణయించడం జరుగుతుంది. వివరాలకు సంప్ర : T. రమేష్, ఫోన్ : 93467 42495 [V- 3488]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం చెల్లించగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

మద్యం సీసాలతో పట్టుబడిన మహిళ



మద్యం, మహిళతో ఎక్సైజ్ సిబ్బంది

అనకాపల్లి: మండలంలో గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేట గ్రామంలో అదే గ్రామానికి చెందిన గొరవల్లి సూరమ్మ ఏడు మద్యం క్వాటర్ సీసాలతో పట్టబడినట్లు అనకాపల్లి ఎక్సైజ్ ఎస్ఐ గణేష్ శుక్రవారం తెలిపారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'పది'లో మెరిసిన దివ్యాంగ విద్యార్థిని



దివ్యాంగ విద్యార్థిని అనూష

అనకాపల్లి: అక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పీహెచ్-16 కేటగిరీ లోకోమోటర్ వ్యాధితో బాధపడుతున్న పదో తరగతి విద్యార్థిని మలక అనూష ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 555 మార్కులు సాధించింది. ఈ మేరకు హెచ్ఎం ఎం.బాపునాయుడు శుక్రవారం ఇక్కడ పాఠశాలలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థిని పాఠశాలలో ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. చదువుకు అంగవైకల్యం అడ్డురాదని అనూష నిరూపించిందన్నారు. రోజూ పరవాడ మండలం మడకపాలెం నుంచి అనకాపల్లి మండలం ఎన్టీఆర్ కాలనీకి ఆరు కిలోమీటర్ల దూరం వచ్చి చదువుకుని మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

రహదారి నిర్మించాలని నిరసన



రహదారి పూర్తి చేయాలని నిరసన చేస్తున్న దృశ్యం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్‌లో రైల్వే స్టేషన్ రహదారి వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారని, కూటమి పాలనలో రోడ్డు నిర్మించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పెరుగుబజార్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అనుగుణంగా రహదారి విస్తరణ చేస్తున్న సమయంలో కొంతమంది గృహాలు తొలగించారని, నిత్యం రద్దీగా ఉన్న రహదారిలో గోతులు, రాళ్లు, రప్పలు, దుమ్ము, ధూళితో వాహనదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 962 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ఠధర	గరిష్ఠధర
మొదటి రకం	3,980	4,610
రెండో రకం	3,570	4,210
మూడో రకం	3,200	3,550

అనకాపల్లి సినిమాలు

రాజా : జింఖానా
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : సారంగపాణి జాతకం
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : పాతం
శ్రీసత్య : భరత్ అనే నేను
రామచంద్ర : జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-8, ఓ పాజిటివ్-21, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యాలోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

టెన్త్ తర్వాత ఏంటి..?

- ఉన్నత విద్యకు ఇంటర్మీడియట్
- సరైన నిర్ణయం తీసుకుంటే భవిత మీదే
- త్వరగా స్థిరపడాలంటే పాలిటెక్నిక్, ఐటీఐ
- పదో తరగతి పాసైన విద్యార్థులకు నిపుణుల సూచన



ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి పౌర్ణమి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ



పదో తరగతి విద్యార్థులు

అనకాపల్లి: ప్రతి విద్యార్థికి పదో తరగతి పునాదిగా భావించాలి. అప్పటి వరకూ కలిసి మెలసి చదువుకునే విద్యార్థులు పదో తరగతి పాసైన తర్వాత వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు సిద్ధపడతారు. కొంతమంది కుటుంబ సమస్యలను దృష్టిలో పెట్టుకుని త్వరగా స్థిరపడాలని వృత్తి విద్య కోర్సులపై దృష్టి సారిస్తారు. ఇప్పటికే పాలిసెట్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. దీంతోపాటు ఇంటర్మీడియట్ ప్రవేశాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఏ గ్రూపు తీసుకోవాలి. ఏ గ్రూపు తీసుకుంటే త్వరగా అభివృద్ధి చెందవచ్చు. ఎవరిని అడగాలి.. అనే సందేహాలు పదో తరగతి పాసైన ప్రతి విద్యార్థిలో ఉంటాయి. ఈ క్రమంలో డిమాండ్ ఉన్న కోర్సులను తమ అభిరుచికి తగినవి ఎంచుకోవాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు దీనిపై దృష్టి సారించి తగు సూచనలు, సలహాలు అందించాల్సి ఉంది. టెన్త్ తర్వాత భవిష్యత్‌కు దోహదపడే కోర్సులు ఇవే..

ఇంటర్మీడియట్..

ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ గ్రూపు ఎంతో ప్రాముఖ్యత కలిగిఉంది. సివిల్, మెకానికల్ ఎలక్ట్రికల్, కంప్యూటర్స్ ఏరో నాటికల్స్ తదితర రంగాల్లో ఇంజనీరింగ్ చేయాలనుకునే వారికి ఎంపీసీ గ్రూపు పునాది వంటింది. వైద్యం, అగ్రికల్చర్ రంగాల వైపు వెళ్లాలనుకునేవారికి బైపీసీ వైపు శ్రద్ధ చూపవచ్చు. సైన్స్, ఆర్ట్స్ గ్రూపులపై పెద్దగా ఆసక్తిలేని విద్యార్థులు సేవా రంగం వైపు వెళ్లేవారు ఎంఈసీ లేదా సీఈసీ గ్రూపులో చేరవచ్చు.

ఐటీఐ, పాలిటెక్నిక్ వృత్తి విద్య...

ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోర్సులు ఎంచుకోవడం ద్వారా చిన్న వయసులోనే ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. పరిస్థితులు అనుకూలిస్తే సాంకేతిక విద్యా రంగంలో ఉన్నత స్థాయి విద్యా కోర్సులు చేయవచ్చు. దీనికోసం విద్యార్థులు పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ సెట్ ఉత్తీర్ణత సాధించాలి. ఈ విద్యకు ఉచితంగా పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. పాలిసెట్ ఉత్తీర్ణత సాధించిన తర్వాత ర్యాంక్‌లను బట్టి కోర్సుల్లో చేరవచ్చు.

విద్యార్థులు అభిరుచి ఉన్న కోర్సు ఎంచుకోవాలి



ప్రతి విద్యార్థికి పదో తరగతి పునాది.. కష్టమైన సబ్జెక్టును కాకుండా ఇష్టమైన దాన్ని ఎంచుకుంటే ఒత్తిడి లేకుండా చదువుకోవచ్చు. ఎవరో చెప్పారని కష్టమైన గ్రూపు తీసుకుని మానసిక ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి. చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించినట్లయితే మంచి ఫలితాలు ఉంటాయి.

– బోయిన చిన్నారావు, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, అనకాపల్లి

విద్యార్థులు చదవగలిగే గ్రూపునే ప్రోత్సహించాలి



కొంతమంది తల్లిదండ్రులు విద్యార్థులను బలవంతం చేసి, ఇష్టంలేని గ్రూపుల్లో చేర్పించడం వల్ల ఒత్తిడికి గురై చదువుకు దూరంగా ఉంటారు. మంచి ఫలితాలు సాధించలేరు. విద్యార్థి మానసిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తగిన సబ్జెక్టులో చేర్పించినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. త్వరగా స్థిరపడటానికి అవకాశాలు ఉన్నాయి.

– ఏవీఎస్ మూర్తి, పదో తరగతి గణిత ఉపాధ్యాయుడు, అనకాపల్లి

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా.



నేను పదో తరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాను. అనకాపల్లి మండలం మామిడిపాలెం గ్రామం మాది. నేను ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా.

– పీలా భవితశ్రీ, విద్యార్థిని

భవిష్యత్తు ఆర్టిఫిషియల్‌దే



నేను పదో తరగతిలో 570 మార్కులు సాధించాను. మండలంలో పాపయ్యసంతపాలెంలో నివసిస్తున్నాను. నేను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్సు చేస్తాను. భవిష్యత్తు అంతా దీనిపై ఆధారపడి ఉంటుంది.

-వియ్యపు హరీష

సీటు సాధిస్తా



నేను పదో తరగతిలో 574 మార్కులు సాధించాను. నేను ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి కంప్యూటర్ ఇంజనీర్ కావాలని నా కల. పది ఫలితాల్లో నాకు వచ్చిన మార్కుల బట్టి నాకు సీటు వస్తుందని నమ్మకం ఉంది.

-దండుపాటి యశోదర

గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల అమ్మవారి 203వ ఊంజల్ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాల కృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రీలు వేదమంత్రాలతో వ్యాపారవేత్త కాండ్రేగుల మురళీకృష్ణ, చంద్రకళ దంపతులు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో అన్నమాచార్య వాగ్గేయ వరద వ్యవస్థాపకుడు తిమ్మాపాత్రుని చక్రవర్తి బృందం కోలాట కీర్తనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, గౌరీ గీత మహిళా మండలి వ్యవస్థాపకురాలు పెతకంశెట్టి సుజాత, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతలకు బాండ్‌లు అందిస్తున్న దేవస్థానం ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ముగ్గురు దాతలు చెరో రూ.లక్ష చొప్పున రూ.3 లక్షల విరాళమిచ్చారు. విశాఖలోని సాగర్‌నగర్‌కు చెందిన కొల్లి శివ కాంత్, ముంబైకి చెందిన పీయూష్ రఘువన్షి, అభినవ్ చతుర్వేదిలు ఒక్కొక్కరు ఒక్కో రూ.లక్ష చొప్పున ఇచ్చారు. దేవస్థానం తరపున దాతలకు అన్నప్రసాద విభాగంలో ఏఈవో పి.శ్రీనివాసరావు బాండ్‌లు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, సీనియర్ అసిస్టెంట్ దొంతల రమణ పాల్గొన్నారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

ప్రలోభాలకు లొంగని కార్పొరేటర్లు

- కార్పొరేటర్లు సునీత, ప్రసన్నలక్ష్మిలకు సమన్వయకర్త భరత్‌కుమార్ సన్మానం



కార్పొరేటర్ సునీత జానకీరామరాజు దంపతులను సత్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్



కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మీ రమేష్ దంపతులను సత్కరిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ మేయరుపై అవిశ్వాస తీర్మానంలో ప్రలోభాలతో గెలిచి ప్రజల్లో చులకన అయిపోయారని అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు స్వగృహంలో ఇటీవల జరిగిన జీవీఎంసీ మేయర్ ఎన్నికలలో కూటమి ప్రభుత్వం పెట్టిన అవిస్వాస తీర్మానానికి వ్యతిరేకంగా నిలిచిన కార్పొరేటర్లకు అభినందన సభ శుక్రవారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా మలసాల భరత్‌కుమార్ హాజరయ్యారు. 80వ వార్డు అధ్యక్షుడు కె.ఎం. నాయుడు అధ్యక్షత వహించిన సభలో భరత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ని ప్రలోభాలు పెట్టినా పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఉండడం కార్పొరేటర్ మందపాటి సునీత నిబద్ధతకు నిదర్శమన్నారు. పార్టీ బీఫామ్ తీసుకొని మరొక పార్టీకి మద్దతు ఇచ్చిన వారి అడ్రస్ గల్లతవ్వడం ఖాయమన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి జానకీరామరాజు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. జానకీరామరాజు మాట్లాడుతూ ఎన్నో ఇబ్బందులకు గురిచేసినా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని, వచ్చే ఎన్నికల్లో భరత్ గెలుపే ధ్యేయంగా పనిచేసి అనకాపల్లి ఎమ్మెల్యే సీటును వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బహుమతిగా అందజేస్తామన్నారు. 82వ వార్డు కార్పొరేటర్ సునీత, జానకీరామరాజు దంపతులను భరత్ శాలువాతో సత్కరించి కృష్ణుని విగ్రహాన్ని బహూకరించారు. 83వ కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులను శాలువాతో సత్కరించి కృష్ణుని విగ్రహాన్ని బహూకరించారు. పలు ఇబ్బందులు పెట్టినా వెనకడుగు వేయకుండా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్న ప్రసన్నలక్ష్మిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మాట్లాడుతూ పార్టీ విజయానికి నిరంతరం కృషి చేసి జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యం అన్నారు. అంతకుముందు రింగ్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తలతో భరత్ సమావేశం నిర్వహించి సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, సీనియర్ నాయకులు గైపూరి రాజు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మీ నరసింహరావు, పలకా సత్యనారాయణ, రత్నకుమారి, కుండల రామకృష్ణ, కొంకి శ్రీరామమూర్తి, మండల నాయకులు అధిక సంఖ్యలో పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండించిన అఖిలపక్ష నేతలు

అనకాపల్లి: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడులు చేయడం సిగ్గుచేటని, దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేసి మృత్యువాత పడిన కుటుంబాలను ఆదుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు కోరారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదులపై తక్షణమే ఉక్కుపాదం మోపేవిధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. దేశంలో ఇటువంటి ఘటనలు మరలా జరగకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాజాన దొరబాబు, సూది కొండ మాణిక్యాలరావు, మత్తుర్తి సూరిబాబు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణను అశ్రద్ధ చేయొద్దు



ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

కశింకోట: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. కశింకోట పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ మలేరియా ఎక్కువగా జ్వరం, చలితో కూడి వస్తుందన్నారు. అశ్రద్ధ చేయకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయ్యాక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు అందిస్తారన్నారు. అనాఫిలిస్ ఆడ దోమలు కుట్టడం వల్లన మలేరియా వస్తుందన్నారు. దీని దృష్ట్యా దోమలు పెరిగే నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇళ్లలోకి ప్రవేశించకుండా కిటికీలు, తలుపులకు జాలీలు అమర్చుకోవాలన్నారు. వేపాకు పొగ పెట్టడం ద్వారా ఇళ్లలో దోమలను తరిమి కొట్టవచ్చునన్నారు. దోమల తెరలు వాడటం వల్ల దోమల కాటు నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. వైద్యుడు సునీల్, ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీలో డాక్టర్ ఎ. మనీషా ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సులో మలేరియా నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి వైద్యురాలు మనీషా వివరించారు. దోమలు నిల్వ నీటిలో వృద్ధి చెందుతాయని, వారానికి ఒక రోజు పాత్రలు, కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా డ్రైడే పాటించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి బి.ఎ. సుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, హెల్త్ సూపర్ వైజర్ కేఎస్ఆర్‌కే నరసింహారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీ పునర్వైభవం



గుడివాడను మర్యాదపూర్వకంగా కలిసిన పరవాడ వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: పార్టీలో నాయకులు అందరు కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ నూతన అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన గుడివాడను పరవాడ ప్రాంత వైఎస్సార్‌సీపీ నేతలు మిందిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం కలిసి దుశ్శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ కూటమి నేతలు అనుసరిస్తున్న అరాచక పాలనను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిని పార్టీలో గుర్తింపు దక్కుతుందన్నారు. పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ అమర్‌నాథ్ నియామకంతో పార్టీకి జిల్లాలో పూర్వవైభవం వస్తుందన్నారు. గుడివాడను కలిసిన వారిలో మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, భర్నికం సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ దలాయి నదియా, కన్నూరు సర్పంచ్ గొల్లవిల్లి శ్రీను కృష్ణవేణి, మాజీ మండల అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, బండారు శ్రీను ఉన్నారు.

మన జిల్లా టమాటాలనే కొనాలి



జిల్లా ఉద్యానవన శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం జిల్లా కోశాధికారి

అనకాపల్లి: ఇటీవల విశాఖపట్నం అగ్రికల్చర్ అధికారులు చిత్తూరు నుంచి వచ్చే టమాటాలు అమ్ముతున్నారని, అనకాపల్లి జిల్లాలో పండించిన టమాటాలను విశాఖ జిల్లాలో అమ్మకాలు సాగించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా రైతు సంఘం కోశాధికారి గండి నాయనబాబు కోరారు. స్థానిక జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌కు తమ కార్యాలయంలో శుక్రవారం వినతపత్రం అందజేశారు. నాయనబాబు మాట్లాడుతూ మండలంలో సిరసపల్లి, వల్లూరు, గొర్లివానిపాలెం, గవర్ల అనకాపల్లి, అసకపల్లి, తదితర గ్రామాల నుంచి రైతులు టమాటాలు పండించి రోజుకు 30 టన్నులు విశాఖపట్నం రైతు బజార్లుకు, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి గత అనేక సంవత్సరాలుగా విక్రయిస్తున్నారన్నారు. మండలం పరిసర గ్రామాల రైతుల పండించిన కూరగాయలు, టమాటా పంటలకు గిట్టుబాటు ధరలు కలిగించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు కె.తేల్లయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రంగాన్ని స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలి

ఉక్కునగరం: ఉక్కు రంగాన్ని నాన్ స్ట్రాటజిక్ నుంచి స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలని నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌సీవోఏ) తీర్మానించిందని విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్ తెలిపారు. మనాలిలో జరిగిన ఎన్‌సీవోఏ నేషనల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్‌లతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన పలు అధికారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్, నగర్‌నార్ ప్లాంట్, డిజైన్ సంస్థ మెకాన్, మైనింగ్ సంస్థ కేఐవోసీఎల్‌లను విలీనం చేసి ఒకే గొడుగు కిందకు తీసుకు రావాలని తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెంచినట్లే పీఎస్‌యూ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ. 25 లక్షలకు పెంచాలని, సమర్థులైన ఛైర్మన్లు, డైరెక్టర్లను సత్వరమే నియమించాలని తీర్మానాలు చేశారు. ఎన్‌సీవోఏ అధ్యక్షులు ఆడాసుల్, సెక్రటరీ జనరల్ అనిల్‌కుమార్, ఛైర్మన్ తోమర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర కుమార్ బంబోర్‌లు పాల్గొన్నారు.







